క్లుప్తంగా

కూలి రేట్లు పెంచాలి



నిరసన తెలియజేస్తున్న హమాలీలు

విజయనగరం ఫూల్‌బాగ్: పేదలకు నిత్యావసర సరుకులు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న సివిల్ సప్లైస్ కార్మికులకు తక్షణమే కూలి రేట్లు పెంచాలని సివిల్ సప్లైస్ హమాలీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక దాసన్నపేట వద్దనున్న సివిల్ సప్లైస్ గొడౌన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై శాఖ ద్వారా కార్మికులకు కూలి రేట్లు పెంచేందుకు అంగీకారం తెలిపినప్పటికీ, ఇంతవరకు జీఓ జారీ చేయలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే జీఓ జారీ చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేయక తప్పదన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

13 మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి, తదితరులు

విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్ఎన్ ల్యాబ్ సంస్థ శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 13 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి తెలిపారు. కళాశాలకు చెందిన బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ హెచ్‌ఆర్ జి.సీతారాం, కె.లలిత , కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అమ్మకాలకే ప్రాధాన్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్కిటెక్ డైరెక్టర్ శ్యామ్ కొండక

నెల్లిమర్ల రూరల్: రానున్న రోజుల్లో డిజిటల్ టెక్నాలజీ అమ్మకాలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అమెరికాలోని లాస్ ఏంజెల్స్ సేల్స్‌ఫోర్స్‌కు చెందిన టెక్నికల్ ఆర్కిటెక్ డైరెక్టర్ శ్యామ్ కొండక తెలిపారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో డిజిటల్ రంగంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. డిజిటల్ టెక్నాలజీ అమ్మకాలలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ రంగంలో కోర్సులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, డీన్ సన్నీడయోల్, బీబీఏ విభాగాధిపతి మోహన్‌బాబు, బీబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్లు వేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరంలోని 29వ డివిజన్ రామకృష్ణానగర్, 46వ డివిజన్ ఎల్‌బీజీ నగర్, ఒకటో డివిజన్ అయ్యప్పనగర్, 32వ డివిజన్ తోటపాలెం వైఎస్సార్‌నగర్‌లో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి ఈ నెల 28న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, వి.రామచంద్రరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి..



పినతాడివాడను కప్పేసిన మంచు దుప్పటి

డెంకాడ: పట్టణాన్ని మంచు దుప్పటి కప్పేసింది. పక్కనే ఉన్నవారు సైతం కనిపించనంతగా మంచు కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మంచు వర్షంలా కురిసింది. వాహనచోదకులు లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించారు.

8 కేసుల నమోదు

విజయనగరం ఫూల్‌బాగ్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పలు రకాల వ్యాపార సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలను లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

ఏడు మాసాలుగా ఇన్‌చార్జుల పాలనే..

● రెగ్యులర్ ఎంపీడీఓ కరువు ● ఒకే వ్యక్తికి మూడు అధికారాలు



విజయనగరం ఎంపీడీఓ కార్యాలయం

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జరగాలన్నా.. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి వంటి అనేక ముఖ్యమైన పనులు జరగాలన్నా ఎంపీడీఓ అనుమతులు ఉండాల్సిందే. అంతటి ప్రాధాన్యం ఉన్న ఎంపీడీఓ పోస్టు రెగ్యులర్ అధికారి అయితే పాలన వేగవంతంతో పాటు ఆయా గ్రామాల్లో అభివృద్ధికి ఢోకా ఉండదు. అదే ఇన్‌చార్జ్ అధికారి అయితే సరైన నిర్ణయాలు తీసుకోవడానికి కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. విషయంలోకి వెళ్తే.. విజయనగరం మండలం ఎంపీడీఓ కార్యాలయంలో గడిచిన కొన్ని నెలలుగా పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయం ఏఓ కూడా సెలవు పెడితే తిరుపతినాయుడే తన బాధ్యతలతో పాటు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా, అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఒకేసారి మూడు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరిస్తున్న పంచాయతీ విస్తరణాధికారి తిరుపతినాయుడు జనవరి 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇతను కూడా కొద్ది రోజుల నుంచి ఈ నెల 26 వరకు సెలవులు పెట్టేశారు. దీంతో ప్రస్తుతం ఏఓగా విధులు నిర్వహిస్తున్న గంటా వెంకటరావు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే పంచాయతీ విస్తరణాధికారిగా గుంకలాం గ్రామ సచివాలయ కార్యదర్శి శంకరరావు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయంలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చిన వారు ఎవరు ఏ బాధ్యతలు నిర్వహిస్తున్నారో తెలియక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ ఎంపీడీఓను నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

రెగ్యులర్ ఎంపీడీఓ లేరు..



విజయనగరానికి రెగ్యులర్ ఎంపీడీఓ లేకపోవడం వాస్తవమే. సిబ్బంది కొరత వల్ల కొంతమందికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నాం. సీఈఓగా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలే అయింది. కాబట్టి అంతకుముందు విషయాలు తెలియవు. వచ్చే నెల మండల స్థాయి అధికారుల బదిలీలు జరుగుతాయి. ఆ సమయంలో రెగ్యులర్ ఎంపీడీఓను నియమించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బీవీ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారికి శుక్రవారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో వేకువ జాము నుంచే అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్ శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్ వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్

ప్రమాదకర మలుపు..



పూసపాటిరేగ మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమ సమీపంలో గల మలుపు ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఈ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గోవిందపురం, భరిణికాం, పతివాడ, చినపతివాడ, రోలుచప్పిడి, కృష్ణాపురం, తదితర గ్రామాలకు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు గాని హెచ్చరిక బోర్డులు గాని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– పూసపాటిరేగ

రోల్ మోడల్‌గా నిలవాలి..



ప్రతి ఆడపిల్లా సమాజానికి రోల్ మెడల్‌గా నిలవాలని ఎంఈఓ సత్యవతి తెలిపారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాత, సూపర్‌వైజర్లు ఎర్రయ్యమ్మ, అనురాధ, మేరీ వనిత, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

నేటి తరానికి గ్రంథాల విలువలు తెలియాలి

● ఎమ్మెల్యే అదితి



వారధి సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రామాయణ, భారత గ్రంథాల విలువలు నేటి తరానికి తెలియాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు విజయలక్ష్మి అన్నారు. రామనారాయణం ప్రాంగణంలో వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌లో వారధి సదస్సును శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయనగరం మండలంలోని సారిక పంచాయతీలో ఉన్న రామనారాయణం ప్రాంగణం అత్యంత అద్భుతమని, ప్రతిఒక్కరూ ఈ ప్రాంగణాన్ని తిలకించి రామయణంలో ఉన్న ప్రతి ఘట్టాన్నీ తెలుసుకోవాలని సూచించారు. శ్రీరామచంద్రుడ్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత జీవనం సాగించాలన్నారు. అనంతరం రామాయాణంపై విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

● ఎస్సై సన్యాసినాయుడు



చొల్లంగిపేటలో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: గ్రామాల్లో ఎక్కడైనా, ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని డి.కొల్లాం, ఆర్.ముంగినాపల్లి, చొల్లంగిపేట గ్రామాల్లో శుక్రవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సైబర్ నేరగాళ్ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అనవసర ఆన్‌లైన్ లింకులకు స్పందించవద్దన్నారు. బ్యాంక్ సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదని సూచించారు. వాహనచోదకులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు



పినతాడివాడలో ఉచిత పశు వైద్యశిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, రైతులు



నెల్లిమర్ల రూరల్: రైతులకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న పశు వైద్యులు

డెంకాడ: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువుల ఆస్పత్రి వైద్యాధికారి సంతోష్ కోరారు. మండలంలోని పినతాడివాడలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో 128 పశువులకు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చింనాయుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, సెక్రెటరీ టి.వెంకటరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారిపల్లిలో..

నెల్లిమర్ల రూరల్: జంతు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సారిపల్లిలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 68 పాడి పశువులకు నట్టల నివారణ మందు.. 46 పశువులకు గర్భకోశ చికిత్సలు, పలు మూగజీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు సంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ చక్రవర్తి వైద్య శిబిరాన్ని సందర్శించి పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ చిన్నారావు, గ్రామ పెద్దలు మజ్జి రామారావు, సారిపల్లి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు



రైల్వేస్టేషన్ ఆవరణలో అధికారులకు సూచనలు చేస్తున్న డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ మనోజ్‌కుమార్ సాహు విజయనగరం రైల్వేస్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ప్రయాణికులతో మాట్లాడి లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. యార్డ్ పాయింట్స్, సిగ్నల్ వ్యవస్థ, ఎలక్ట్రికల్, ఓహెచ్ఈలు, ఆర్ఆర్ఐ క్యాబిన్‌లను పరిశీలించారు. విజయనగరం – పలాస మధ్య థర్డ్‌లైన్ ప్రాజెక్ట్‌కి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రన్నింగ్ రూమ్, వాణిజ్య సౌకర్యాలు, స్టేషన్, యార్డ్ మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. డీఆర్‌ఎం వెంట సీనియర్ డీసీఎం కె.సందీప్, ఇంజినీరింగ్, ఐఓడబ్ల్యూ, పీడబ్ల్యూ, ఎలక్ట్రికల్, కమర్షియల్, తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి..

● పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు కామేశ్వరరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఎంతటి ఉద్యమాలకైనా సిద్ధంగా ఉండాలని జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో నిర్వహించిన పీఏసీఎస్ ఉద్యోగుల సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఏఐడీఈఏ యూనియన్ అనుబంధ సంఘమైన జిల్లా పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం బలోపేతానికి అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి విజయనగరంలో ఉన్న 94 పీఏసీఎస్‌లలో నూతనంగా 2019లో జాయిన్ అయిన 102 మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బి.రామునాయుడు, రాష్ట్ర నాయకులు డి.నారాయణరావు, పి.సత్యనారాయణ, ఆర్వీఏ నాయుడు, ఎం.బలరాంనాయుడు, ఏవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు నేత్ర పరీక్షలు తప్పనిసరి

● డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్



ఉచిత నేత్ర వైద్య శిబిరం వద్ద డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్, సిబ్బంది, డ్రైవర్లు

విజయనగరం క్రైమ్: వాహన డ్రైవర్లందరూ తప్పనిసరిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డి.మణికుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని కార్యాలయం ఆవరణలో డ్రైవర్లకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగడానికి డ్రైవర్ల కంటిచూపు కూడా ఒక కారణమేనన్నారు. కంటిచూపు సరిగా లేకపోవడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక, రోడ్డు భద్రతా సంకేతాలు కనిపించక ప్రమాదాలు జరుగుతుంటాయని చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యబృందం, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పి.శివరాం గోపాల్, వి.వెంకటరావు, ఎం.ఉష, బి.శ్రావ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



పూసపాటిరేగ: కోనాడలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



పూసపాటిరేగ: భోగాపురంలో బాలిక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్సై సూర్యకుమారి, తదితరులు



నెల్లిమర్ల: మాట్లాడుతున్న కేసలి అప్పారావు

పూసపాటిరేగ: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ భోగాపురం సెక్టార్ సూపర్‌వైజర్ సత్యవతి అన్నారు. మండలంలోని కోనాడ, పేరాపురం గ్రామాలలో జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలకు సమాజంలో గౌరవమైన స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది లక్ష్మి, అనిత, ఉమ, చిన్నమ్మలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చదువులో రాణించాలి..

పూసపాటిరేగ: బాలికలు చదువులో రాణించాలని ఎస్సై సూర్యకుమారి అన్నారు. భోగాపురం కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ రమణమూర్తి, భోగాపురం సెక్టర్ ఏసీడీపీఓ సత్యవతి, వైద్యాధికారి స్రవంతి, ప్రిన్సిపాల్ అరుణ, సూపర్‌వైజర్లు శాంతి, లత, నాగమణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో..

నెల్లిమర్ల: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆకాంక్షించారు. స్థానిక కేజీబీవీలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలకు ముఖ్యంగా విద్య , ఆరోగ్యం, భద్రత కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెడు స్నేహాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.